క్లుప్తంగా

క్రీడాకారిణులకు టీ షర్టుల పంపిణీ



హ్యాండ్‌బాల్ క్రీడాకారిణులకు టీ షర్టులు అందించిన అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చని ఏలూరు జిల్లా కారాగారం జైలర్ కె.వెంకటరెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక కస్తూరిబా నగర పాలక బాలికోన్నత పాఠశాలకు చెందిన సుమారు 15 మంది హ్యాండ్ బాల్ క్రీడాకారిణులకు టీ షర్టులను ఆంధ్రప్రదేశ్ కళాశాలల విశ్రాంత అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, జైలర్ వెంకటరెడ్డి సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శారీర, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని, మేధాశక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎంవీఎల్ ప్రసన్న, క్రీడా శిక్షకురాలు మల్లిక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఏలూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పడమర వీధి, పాత బస్టాండు, వసంతమహల్, రామకృష్ణాపురం, గ్రీన్ సిటీ, హనుమాన్ నగర్, గొల్లాయగూడెం, గులాబి తోట, నెహ్రూ కాలనీ, కొబ్బరితోట, వంగాయగూడెం, రామచంద్రరావు పేట, పత్తేబాద నాలుగు గుడుల సెంటర్, పానుగంటి వారి వీధి, అతిథి హోటల్ రోడ్డు, శంకర మఠం, విజయవిహార్ సెంటర్, అమీనా పేట, అశోక్ నగర్, పత్తేబాద, మోతేవారి తోట, దాసరి ఎర్రయ్య వీధి, నరసింహరావు పేట, పవర్ పేట, పోలీస్ క్వార్టర్స్, రంగూన్ మేడ వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అగ్రహారం, అంబికా సెంటర్, న్యూ మార్కెట్ ప్రాంతం, తూర్పు వీధి, మెయిన్ బజార్, టీచర్స్ కాలనీ, వెన్నవల్లివారి పేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టి వారి పేట, లంబాడీ పేట, బెనర్జీ పేట, కెనాల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు, తిమ్మారావు గూడెం, కేడీ పురం, గుడివాక లంక, మొండికోడు, ప్రత్తికోళ్ల లంక, పైడి చింతపాడు, కొక్కిరాయి లంక, కోమటి లంక, పెద్దయాగిరిమిల్లి, చిన్నయాగిరిమిల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

సీతారామ కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే నానికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ 40వ డివిజన్‌లో రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానిని కోరారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

మండుతున్న ఎండలు

40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

ఏలూరు (మెట్రో): రోహిణీకార్తె రాకముందే రోళ్లు పగులుతున్నాయి. రోడ్ల వెంట ఆవిర్లు వస్తున్నాయి. జిల్లాలో ఎండలు ఏప్రిల్ ఆరంభంలోనే మండిపోతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచే భానుడి భగభగలు ఆరంభమయ్యాయి. పట్టణాల్లో ఇప్పటికే 40 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు చేరువయ్యాయి. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఏలూరు జిల్లా కేంద్రంలో 40 డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కేంద్రంలో 40 డిగ్రీలకు చేరుకున్నాయి. జంగారెడ్డిగూడెం, నూజివీడులలో 39, 40 డిగ్రీల మధ్య, తాడేపల్లిగూడెం, తణుకు, నర్సాపురం 37 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రతి నాలుగేళ్లలో వాతావరణంలో వచ్చే మార్పులే అత్యధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల నమోదుకు కారణమని వాతావరణ శాఖ చెబుతోంది. గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటుగా ఏపీలోనూ ఈ ఏడాది భారీ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. రానున్న వర్షాకాలంలో సైతం నాలుగేళ్ల కంటే ఈ ఏడాది అధికంగానే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

ఆత్మీయ ఆలింగనాలతో పరస్పర శుభాకాంక్షలు



రంజాన్ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం మహిళలు



రంజాన్ నమాజు ప్రార్థనల్లో పాల్గొన్న చిన్నారులు



ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం యువకులు



వంగాయగూడెంలోని ఈద్‌గాహ్‌లో ప్రసంగిస్తున్న ప్రభుత్వ ఖాజీ హుస్సేన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరంలో రంజాన్ పండుగను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ ప్రాంగణాల్లో ప్రత్యేక నమాజులు చేశారు. ముస్లిం మత పెద్దలు విశేష ప్రార్థనలు నిర్వహించి దివ్య ఖురాన్ బోధనలు వినిపించారు. ప్రతి ఒక్కరూ ఖుర్ఆన్ సూచించిన మార్గంలో పయనించి శాంతిస్థాపనకు కృషి చేయాలని సూచించారు. సర్వమత సమానత్వం పాటించాలని, మనుషులంతా ఒక్కటే అనే నినాదాన్ని విశ్వవ్యాప్తం చేయాలని చెప్పారు. వంగాయగూడెం రోడ్డులోని ఈద్‌గాహ్ ప్రాంగణంలో ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాయే సృష్టికి మూలమని, అల్లాహ్ బోధనలు ప్రతి ముస్లింకూ శిరోధార్యమని అన్నారు. ఫిత్ర్, జకాత్ దానాలతో సమాజంలోని పేదలకు అండగా నిలవాలని సూచించారు. రంజాన్ పండుగ మత సామరస్యానికి, దాతృత్వానికి, కరుణకు ప్రతీక అని అన్నారు. అల్లాహ్ ఆశీస్సులతో ప్రపంచ మానవాళికి సర్వ సుఖాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయడం ద్వారా అల్లాహ్‌కు చేరువ కావచ్చని అన్నారు. సమాజంలో ఇతరులతో ఐక్యతగా మెలగడం, పేదలకు తోడ్పడడం, చెడు భావనలను, అధర్మాన్ని వీడాలని దివ్య ఖుర్ఆన్ గ్రంథం బోధిస్తోందని చెప్పారు. పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానంలో నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంజుమన్ సంస్థ ప్రతినిధులు ఎండీ సులేమాన్, రాజా అహ్మద్, ఎండీ ఎగ్బాల్ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీవారపు పేటలోని అహలే హదీస్ మసీదు, ఉమర్ ఏ ఫరూఖ్ మసీదు, మర్కజ్ ఈనామ్ మసీదు, జుమీరాత్ మసీదు, బీడీ కాలనీ మసీదు, ఇస్లాం పేట మసీదు, ఫాతిమా మసీదు, జిల్లా మసీదు, శనివారపు పేట మసీదు, దొండపాడు మసీదు, తంగెళ్లమూడిలోని నెహర్ మసీదు, రాణీ నగర్‌లోని పురానా మసీద్, నయా మసీదు, జామియా మసీదు, చౌక్ మసీదు, ఖురేషీ మసీదు, నాథూమియా మసీదు, మదీనా మసీదు, ఆక్కిలేట్ మసీదు, ఎంఎం కాలనీ మసీదు, మాదేపల్లి మసీదు, గేట్ మసీదు, మహ్మదీయ మసీదు, వైఎస్సార్ కాలనీ మసీదు, తబ్లిక్ జమాత్ మసీదు, నూర్ మసీదుల్లో విశేష ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరిని ఒకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దానాలు చేశారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగ నిర్మాత బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 133వ జయంతిని ఘనంగా నిర్వహించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పిలుపు నిచ్చారు. స్థానిక ఎన్ఆర్ పేటలోని సంఘ కార్యాలయంలో గురువారం ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అంబేడ్కర్ ఆరాధ్య దైవమని అన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు కాపుదాసి రవి, నేతల సువర్ణరాజు, నన్నేటి నాగరాజు, నేతల సాల్మన్ రాజు, కోలాటి ప్రసాదరావు, దాసరి చిరంజీవి, మానుకొండ వెంకటరాజు, కోరం రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు అడిగినందుకు దాడి

ఏలూరు టౌన్: ఆక్వా ఫుడ్ వ్యాపారి సత్రంపాడు గ్రీన్‌సిటీకి చెందిన మందలపు వంశీ ఇటీవల పువ్వుల పవన్ కుమార్‌కు కొంత సొమ్ము అప్పుగా ఇచ్చాడు. అప్పు తిరిగి ఇవ్వమని పవన్ కుమార్‌ను అడగగా ఇవ్వకుండా దుర్భాషలాడారు. దుకాణంలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు గురువారం రాత్రి పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

ప్రజలను ఓట్లు అడిగే హక్కు టీడీపీకి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని

ఏలూరు టౌన్: గత మేనిఫెస్టోలో ఏ ఒక్క హామీనీ అమలు చేయని టీడీపీ ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 15వ డివిజన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం రాత్రి కార్పొరేటర్ తంగెళ్ల రాము, అభిరెడ్డి రంగముత్యాలు, బత్తుల దుర్గారావు ఆధ్వర్యంలో ఆముదాల అప్పలస్వామి కాలనీలో ఏర్పాటు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ టీడీపీ కూటమికి ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వస్తారని, ఐదేళ్ల పాటు కుట్రలు చేయటానికి, ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేయటానికే టీడీపీ కుటిల యత్నాలు చేసిందని ఆరోపించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోను చూపించి, ప్రజలను ఓట్లు అడిగే దమ్ము టీడీపీకి ఉందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమానికి కట్టుబడి అనేక సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేశారని వివరించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని ఆపకుండా ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నారని గుర్తుచేశారు. ఏలూరులో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, స్థానిక నాయకులు వెలగ అన్నవరం, యడ్ల నాగేశ్వరరావు, శానం రవి, తలారి రాము తదితరులు ఉన్నారు.

జగన్‌కే కొల్లేరు ప్రజల మద్దతు



కొక్కిరాయిలంకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరు రూరల్ : కొల్లేరు ప్రజలు సంపూర్ణ మద్దతు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు గురువారం కొక్కిరాయిలంకలో నేను సిద్ధం, మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొల్లేరు ప్రజలు సంక్షేమ పథకాలు పొందలేకపోయారని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో కొల్లేరు ప్రజలు పెద్ద ఎత్తున పథకాల లబ్ధి పొందారని వివరించారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, వైఎస్సార్ కానుక, ఇంటి స్థలం తదితర పథకాలకు సంబంధించి ప్రతి కుటుంబం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ లబ్ధి పొందినట్టు చెప్పారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో లంక 15 గ్రామాల్లో సుమారు కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ వేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అబ్బయ్యచౌదరినే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ లంకగ్రామాలు వైఎస్సార్ సీపీకి పెట్టని కోట అన్నారు. గతంలో మాదిరి కొల్లేరు ప్రజలు టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మరని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ కొల్లేరు ప్రజలు, నాయకులు సంయక్తంగా పని చేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన మరోసారి తీసుకురావాలని కోరారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు అందించి, సంక్షేమ పథకాలు, పాలనను వివరించారు. ప్రచారంలో సర్పంచ్ తోకల అమల, గ్రాబాధ్యక్షుడు కుర్మా ప్రకాష్, ప్రత్తికోళ్లలంక, మాదేపల్లి సర్పంచ్‌లు ఘంటసాల మహలక్ష్మీరాజు, కొరపాటి శ్రీరామ్ ప్రభుదేవ్, గుడివాకలంక నాయకులు బలే బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే



ఏలూరు మెట్రో : జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్ఓ పుష్పమణి తదితరులు



ఏలూరు టూటౌన్ : బోఫ్ ఆధ్వర్యంలో పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు(మెట్రో): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు పాటుపడిన జ్యోతిరావు పూలే అందరికి ఆదర్శప్రాయుడని జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి డీఆర్ఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థికంగా, సామాజికంగా ఒక చైతన్యవంతమైన జీవితం సాగించేందుకు చదువు చాలా అవసరమని మహాత్మా జ్యోతిరావు పూలే ఆనాడే గుర్తించి, ఆచరించారని డీఆర్ఓ గుర్తుచేశారు. కుల, లింగ, వివక్షతకు తావు లేకుండా విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిరావు పూలే ఆలోచన విధానాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆయన సహచరి సావిత్రిబాయికి గురువుగా మారి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్ పుష్పాలత, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్ సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ జేడీ జి.నెహ్రూబాబు, ఆర్ఐఓ ప్రభాకరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.బాబ్జి, దేవకీ రాణి, ఎన్‌జీఓ నాయకుడు చోడగిరి శ్రీనివాస్, దేవరకొండ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు. స్థానిక జిలా పరిషత్ సెంటర్‌లోని పూలే దంపతుల విగ్రహాల వద్ద ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కొరబండి బాబూరావు, కనికెళ్ల మురళి, కె.రవిప్రసాద్, సిద్దు తదితరులు పాల్గొన్నారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బోఫ్) ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జీవీఎల్ నరసింహారావు, మల్లిపూడి రాజు, మేతర అజయ్ బాబు, పరిసిపోగు బాలరాజు, అలుగుల సాయి రాజు, రమేష్ నాయక్, గూడే రాంబాబు, రిటైర్డ్ ఎస్ఐ మిల్టన్, కర్రే అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

- బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు విగ్రహం వద్ద నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్ కుమార్, రాష్ట్ర కన్వీనర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామర్తి యేసురాజు మాట్లాడారు. సంఘం నాయకులు వై.మోహన్ కృష్ణ, లక్ష్మీనారాయణ, పి.ఆంజనేయులు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, తెంటు సూర్యనారాయణ, సర్వేశ్వరరావు, సాయిరాజు, లక్కోజు రాజగోపాలాచారి, ఎంవీ సుబ్బారావు, మట్టా నాగేంద్ర వి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- ఆర్ఆర్‌పేటలోని బీసీ సబ్ ప్లాన్, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడారు. ఉక్కుసూరి గోపాల కృష్ణ, మేతర అజయ్‌బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తరోడ్డులోని నవసమాజ్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్ మాట్లాడారు. నేతల రమేష్ బాబు, అందుగల రతన్ కాంత్, బుంగా ఏసు, కర్రే అంబేడ్కర్, భూపతి అప్పారావు, అన్నవరం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో విజ్ఞానకేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మేతర అజయ్ బాబులు మాట్లాడారు. సినీ డైరెక్టర్ ఆనంద్ సాగర్, కోడైరెక్టర్ శివరామకృష్ణ, డి.గణేష్, ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు మేతర అశోక్ కుమార్ అధ్యక్షతన జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు మాట్లాడారు. మెల్లిపాక వెంకన్న, కాకర్ల శ్రీను,బాలరాజు, నేదురు శ్రీను, చల్లా జాకబ్, కిషోర్, వనిత, ఝాన్సీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.
- పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పూలే దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రవి, నాయకులు పి.కిషోర్, బి.సోమయ్య మాట్లాడారు.



ఏలూరు టూటౌన్ : జెడ్పీ సెంటర్‌లో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు



ఏలూరు టూటౌన్ : ప్రైవేటురంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో నాయకుల నివాళి



ఏలూరు టూటౌన్ : పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగులు

గన్నీ బ్యాగ్ గోదాములో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు వన్ టౌన్ గడియార స్తంభం ప్రాంతంలోని గన్నీ బ్యాగ్ గోదాములో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఏలూరు వన్ టౌన్ ప్రాంతానికి చెందిన కర్రి శ్రీనివాసరావుకు చెందిన గన్నీ బ్యాగ్ గోదాములోం గురువారం రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన సిబ్బంది అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 75 వేల ఆస్తి నష్టం సంభవించిందని, ప్రమాదానికి గల కారణాలను సేకరిస్తున్నామని ఏలూరు అగ్ని మాపక అధికారి వీవీ రామకృష్ణ తెలిపారు. సుమారు రూ.1.75 లక్షల ఆస్తిని కాపాడమన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నట్టు చెప్పారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

ఏలూరు టౌన్: ఆన్‌లైన్‌లో సొమ్ము స్వాహాపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారపుపేటకు చెందిన సత్యదుర్గ సాయి కిరణ్ ఇటీవల తన ఫోన్‌లో అనూష హెచ్ఆర్ మేనేజర్ అనే లింకు ఓపెన్ చేసి దానిలో ఆన్‌లైన్‌లో వారు ఇచ్చిన టాస్క్‌లను పూర్తి చేశాడు. ఒక్కో టాస్క్‌కు ఒక్కొక్క రేటు నిర్ణయించి, కట్టిన డబ్బుకు రెట్టింపు డబ్బు వస్తుందని నమ్మించారు. మొదట్లో తాను కట్టిన సొమ్ముకు రెట్టింపు డబ్బులు రావడంతో ఈ ఆన్‌లైన్ మోసాన్ని గుర్తించలేకపోయారు. దఫదఫాలుగా సొమ్ములు కట్టించుకోగా సుమారు రూ.3.20 లక్షలు వారి వద్ద ఉండిపోయాయి. సొమ్ము తిరిగి ఇవ్వకుండా తాత్సారం చేయడంతో బాధితుడు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.